
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 ఆగస్టు 2024
5
తిరుపతి



కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంత వరద బాధితులకు సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని నాలుగు మాడవీధులలో ఆర్థిక విరాళాలు సేకరించారు. పలువురు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా వయనాడ్ బాధితులకు సాయమందించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గంధం మణి, రాపూరు సుబ్రమణ్యం, రాజా, వెలివేంద్రం, ఉస్మాన్ బాషా, అన్వర్ బాషా, గురవయ్య, నాగరాజమ్మ పాల్గొన్నారు.

శిథిలావస్థలో యుడిఎస్

- చిన్నపాటి వర్షాలకి పొంగుతున్న రోడ్లు, కాలువలు
- కొత్త ప్రతిపాదనకు రూ.200 కోట్లు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

నగరంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరింది. తిరుపతిలో చిన్నపాటి వర్షం కురిస్తే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగి ప్రవహించడమే కాకుండా మురుగు కాలువలు రోడ్లు చెరువులను తలపిస్తాయి. దీని ప్రధాన కారణం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడమే. ప్రస్తుతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొత్త కనెక్షన్ చేపట్టాలంటే సుమారు 200 కోట్ల రూపాయలు నిధులు అవసరం అవుతుంది.. తిరుపతి నగరపాలక సంస్థ వద్ద ఇంత పెద్ద మొత్తంలో నిధులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకంలో నిధులు ఇస్తే తప్ప కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించుకోనే పరిస్థితి లేదు.

గత నెలలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో తిరుపతి కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించుకోవడానికి ప్రతిపాదనలు పంపాలని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కోరడం జరిగింది. అందుకు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించుకోవడానికి 200 నుంచి 250 కోట్లు ఖర్చు అయ్యే అవకాశం ఉందని ప్రతిపాదనలు తయారు చేశారు. ఇంత పెద్ద మొత్తం నిధులు కార్పొరేషన్ వద్ద లేకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు టీటీడీ సహకరిస్తే కొత్త కనెక్షన్ నిర్మించి డ్రైనేజీ వ్యవస్థ నుంచి ప్రజలకు మేలు జరిగేలా చేయవచ్చని అధికారులు అంటున్నారు.

1996లో 18 కోట్ల రూపాయలతో తిరుపతి నుంచి రేణిగుంట తూకివాకం వరకు 14 కిలోమీటర్ల వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించడం జరిగింది. అప్పట్లో ఆర్‌ఆర్‌సి పైపులతో 25 సంవత్సరాలు కాల పరిమితితో నిర్మించారు. ప్రస్తుతం దాన్ని కాలపరిమిత ముగియడంతో కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డిఐ (ఇనుము) పైపులు పెట్టి 50 సంవత్సరాల కాలంతో నిర్మించాలని భావిస్తున్నారు. గతంలో తిరుపతి స్మార్ట్‌సిటీ పథకంలో యుడిఎస్ కొత్త కనెక్షన్ నిర్మించాలని ప్రతిపాదన తయారు చేస్తే ఆ పథకంలో దీన్ని తిరస్కరించడం జరిగింది. స్మార్ట్ సిటీ పథకంలో యు డేస్ వర్తించదని కేంద్రం స్పష్టం చేసింది.

తిరుపతి- రేణుగుంట మార్గానికే 100 కోట్లు...

తిరుపతి- రేణిగుంట మార్గంలో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ మార్చడానికి సుమారు 100 కోట్ల రూపాయలు ఖర్చువుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇక్కడ తరచూ పైపులైన్ దెబ్బతింటూ ఉండడంతో నగరపాలక సంస్థ అధికారులు తాత్కాలిక మరమ్మతుల పేరుతో గత ఐదు సంవత్సరాల కాలంలో సుమారు 6 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ మార్గంలో పైపులైన్ మరమ్మతులు చేసిన ప్రైవేట్ టెలిఫోన్ ఆపరేటర్ కంపెనీలు తరచు కేబుల్ వేయడానికి రోడ్లు తవ్వుతూ ఉండడం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ దెబ్బ తినడానికి ఒక కారణమని చెప్పవచ్చు. గత ఐదు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి కార్పొరేషన్‌కి ఎటువంటి ప్రత్యేక పథకాలు నిధులు ఇవ్వకపోవడం వల్ల అండగా ఉంటాయని కొత్త నిర్మాణానికి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రాష్ట్రానికి పంపలేదు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ ఇలా...

తిరుపతి నగరంలో 1996లో వేసిన అండర్ గ్రౌండ్ కనెక్షన్ ఇంజనీరింగ్ అధికారులు రేణిగుంట మండలం తూకివాకం గ్రామంలో ఫిల్టర్ ట్యాంకు నిర్మించారు. అక్కడ నుంచి రేణిగుంట తిరుపతి రోడ్డు మార్గంలోని నాలుగున్నర ఇంచుల ఆర్‌ఆర్సి పైపుల ద్వారా తిరుపతి 14కిలోమీటర్ల లోపు కనెక్షన్ తీసుకురావడం జరిగింది. ప్రతి ఇంటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ ఇచ్చే విధంగా తీసుకురావడం జరిగింది. నగరంలో సుమారు 4లక్షల మంది జనాభా ఉన్నారు. 50 డివిజన్లకు గాను 60 వేల యుడిఎస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో నుంచి వచ్చే మురుగును నేరుగా రేణిగుంట మీదుగా తూకివాకం గ్రామంలో ఉండే మురుగునీటి ఫిల్టర్‌లో మురుగును ఫిల్టర్ చేసి అప్పట్లో రైతులకు ఉచితంగా పొలాలకు నీళు ఇచ్చేవారు. ప్రస్తుతం ఫిల్టర్ చేసిన మురుగు నీరుని కొన్ని ప్రైవేట్ ఫ్యాక్టరీలకు లీటర్ల చొప్పున నగరపాలక సంస్థ సరఫరా చేస్తుంది. ఇందుకు గాను ప్రైవేట్ కంపెనీను లీటర్ చొప్పున నగరపాలక సంస్థకు నగదు రూపంలో చెల్లిస్తున్నారు. ఏడాదికి నగరపాల సంస్థకు సుమారు 10 నుంచి 20 లక్షలు ఆదాయం వస్తుంది.



ఎలుకలతో దెబ్బతిన్నాయి ఇంటర్నల్ కనెక్షన్...

నగరంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇంటర్నల్ కనెక్షన్లు కూడా ఎలుకల వల్ల చాలా వరకు దెబ్బతిన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో మార్చివేసి కొత్త కనెక్షన్ వేయాల్సి వస్తుంది మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఇటు రాష్ట్ర ప్రభుత్వ పాటు కేంద్ర ప్రభుత్వాన్ని కూడా ఓ నివేదికను తయారు చేసే ఇవ్వనున్నారు. నగరంలో చిన్నపాటి వర్షాలకి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగడం నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులకు ఓ సవాల్‌గా మారింది. వర్షాకాలంలో రాకముందే నగరంలో మురుగు కాలువలు కూడికతీత పనులు చేసేవారు ఈ ఏడాది మురుగు నీటి కాలువ పూడికతీత పనులు టెండర్లు ఆలస్యంగా పిలవడంతో పనులు నత్తనడక సాగుతున్నాయి. చాలా వరకు మాత్రం అండర్ గ్రౌండ్ దెబ్బ తినడానికి ఎలుకలు కూడా ఒక కారణమని స్థానికులు అంటున్నారు. ఏదిఏమైనా టిటిడి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయిస్తే కొత్త డ్రైనేజీ వ్యవస్థను నిర్మించుకోవచ్చు.

అక్టోబర్ 4 నుంచి

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

నాలుగు మాడ వీధులను తనిఖీ చేసిన అదనపు ఈవో



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12 వరకు జరుగనున్న నేపథ్యంలో నాలుగు మాడవీధుల్లో ఉన్న వివిధ ప్రవేశ, నిష్క్రమణ, హారతి పాయింట్ల గురించి తెలుసుకోవడానికి అన్ని గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన మండపం నుంచి ప్రారంభమై నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలు, తిరుమల నంబి ఆలయం వద్ద కదిలే వంతెన, గ్యాలరీల వద్ద ప్రవేశ నిష్క్రమణ పాయింట్లు మరియు ఇతర సంబంధిత సమాచారాన్ని అధికారులు అదనపు ఈవోకు వివరించారు. డిప్యూటీ ఈవో లోకనాథం, విజివో నందకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల దర్శనంపై పుకార్లను నమ్మవద్దు

భక్తులకు టీటీడీ మరో మారు విజ్ఞప్తి

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్ మీడియాలో గత కొంతకాలంగా చక్కర్లు కొడుతున్నాయి. ఇవి పూర్తిగా అవాస్తవమని, వాస్తవం ఏమిటంటే, ప్రతిరోజు 1000 మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టిటిడి ప్రతి నెల 23 మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50ల ఒక లడ్డూ ఉచితంగా లభిస్తుంది. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్, పిహెచ్‌సి లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. కావున సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఇలాంటి తప్పుడు వార్తలు లేదా వదంతులను నమ్మవద్దని టీటీడీ భక్తులకు మరోమారు విజ్ఞప్తి చేస్తున్నది. భక్తులు సరైన సమాచారానికి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www.tirumala.org, https://ttdevastanams.ap.inను మాత్రమే సంప్రదించగలరు.

ఏపీ మంత్రులను కలిసిన శ్రీసిటీ ఎండీ

ప్రజాశక్తి- వరదయ్యపాలెం, సత్యవేడు:



రాష్ట్ర రాజధానిలో తన రెండు రోజుల పర్యటనలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పలువురు రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రితో భేటీ అనంతరం పలువురు క్యాబినెట్ మంత్రులతో సమావేశమై చర్చించారు. వీరిలో వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్‌తో పాటు గతంలో తనతో, శ్రీసిటీతో సాన్నిహిత్యం ఉన్న పట్టణాభివృద్ధి, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి డాక్టర్ పి.నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి వున్నారు. మంత్రులతో చర్చల సమయంలో, శ్రీసిటీ ప్రస్తుతస్థితి, కొనసాగుతున్న, చేపట్టనున్న వివిధ పారిశ్రామిక ప్రగతి ప్రణాళికలను వారికి వివరించారు. శ్రీసిటీని సందర్శించి పురోగతిని ప్రత్యక్షంగా చూడాలని ఆయన మంత్రులను ఆహ్వానించారు. ఆహ్వానం పట్ల వారు సానుకూలంగా స్పందించారు. పారిశ్రామిక కేంద్రం అభివృద్ధిని పరిశీలించడానికి ఆసక్తిని వ్యక్తం చేశారు. తన రెండు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసిందని, పారిశ్రామిక వృద్ధి , ఉపాధి సృష్టిలో కీలకమైన పలువురి వ్యక్తులను కలవడం, వారి మద్దతు పొందడం సంతోషంగా ఉందంటూ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు.

బాలికల హాస్టల్లో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- తొట్టంబేడు



తొట్టంబేడు మండలకేంద్రంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహాల వద్ద సర్పంచ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో పూడికతీత, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్బయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సహాయ, సహకారాలతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యతనీ, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని శ్రీకాళహస్తి సబ్ జైలర్ శ్రీకాంత్ అన్నారు. స్థానిక సబ్ జైలు ఆవరణలో యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీసెస్ అసోసియేషన్, ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సబ్ జైలర్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్ సంస్థ అధ్యక్షులు హేమ్ కుమార్, సభ్యులు కాంగ్రెస్, శ్రీనివాసులు, సురేష్, రాజశేఖర్, రమణ, నారాయణ, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమరా హాస్పిటల్ చారిత్రక ఒప్పందం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: తిరుపతి అమర హాస్పిటల్ – బేలారస్ గోమెల్ స్టేట్ మెడికల్ యూనివర్శిటీ వైద్య రంగంలో విద్యా, సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడానికి ఒక మైలురాయి ఒప్పందాన్ని ఆదివారం అమర హాస్పిటల్‌లో ఒప్పంద పత్రాలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండు సంస్థల మధ్య క్లినికల్ అబ్జర్వర్షిప్, శిక్షణ కార్యక్రమాలు, పరిశోధన సహకారాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఒప్పందం ప్రకారం జి.ఎస్ ఎం యు విద్యార్థులు అమరా హాస్పిటల్లో క్లినికల్ శిక్షణ పొందే అవకాశం ఉంటుంది, అయితే ఫ్యాకల్టీ సభ్యులు ప్రొఫెషనల్ ఎక్స్చేంజీలు, సహకార పరిశోధన ప్రాజెక్టులలో పాల్గొంటారు. ఈ భాగస్వామ్యం ఉమ్మడి పరిశోధన వర్క్ షాప్లు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా సులభతరం చేస్తుంది. సమావేశంలో విదేశాలను చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి అమర హాస్పిటల్ చైర్మన్ ప్రసాద్ గౌరినేని ఒక కొత్త అధ్యాయానికి ఈరోజు నాంది పలికామని అన్నారు. ఐదేళ్ల ఒప్పందంలో వైద్యవిద్య, పరిశోధనల అంతర్జాతీయాకరణలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. రెండు సంస్థలు ఉమ్మడి కార్యక్రమాల ద్వారా వైద్య శాస్త్రం, అభ్యాసాన్ని అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉంటాయని పేర్కొన్నారు. డాక్టర్ కరామి ఆండ్రీ, డీన్ మాట్లాడుతూ భారతదేశంలోని ప్రఖ్యాత సంస్థ అయిన అమరా హాస్పిటల్తో భాగస్వామ్యం కావడం మాకు ఆనందంగా ఉందన్నారు. ఈ ఒప్పందం మా విద్యార్థులకు విలువైన క్లినికల్ ఎక్స్పోజర్ను అందిస్తుందని మా ఫ్యాకల్టీ సభ్యుల మధ్య అర్థవంతమైన సహకారాన్ని ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం విదేశాల నుంచి అతిథులను అమర హాస్పిటల్ తరఫున ఘనంగా సన్మానించి మెమెంటోలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో అమర హాస్పిటల్ సీఏఓ వేణుగోపాల నాయుడు, డిఎంహెచ్ఓ శ్రీహరి, మెడికో అబ్రాడ్ చైర్మన్ రాజారామ్, పేరెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరకిరణ్, వైస్‌ప్రెసిడెంట్ ప్రియవర్ధన బాబు, ట్రెజరర్ హేమాద్రి, రాధ పాల్గొన్నారు.



ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలి

'భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి'



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకువచ్చి భవననిర్మాణ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) తిరుపతి జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎంబి భవన్‌లో ఎస్.అల్లెయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడారు. గత ప్రభుత్వం మెమో నెంబర్ 1214 తీసుకువచ్చి భవన నిర్మాణ కార్మికుల క్లైమ్లను సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. బోర్డులో ఉన్న సొమ్మును ఇతర పథకాలకు వాడుకున్నారని, వాటిని తిరిగి బోర్డుకు చెల్లించి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీను అమలు చేయాలని కరోనా సమయంలో ఇసుక లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని సంక్షేమ బోర్డులో ఉన్న సొమ్మును అర్హులైన వారికి తల పదివేలు ఇవ్వాలని గతంలో డిమాండ్ చేశామని అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు కాబట్టి ఈ ఎన్నికలలో ప్రభుత్వాన్ని భవన నిర్మాణ కార్మికులు కూటమి ప్రభుత్వాన్ని ఊహించని రీతిలో గెలిపించుకున్నారని తెలియజేశారు. అయితే ఇప్పటివరకు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను 2019 నుండి కార్మికుల క్లైమ్లను, సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా భవన నిర్మాణ సంఘం కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు మాట్లాడుతూ సంక్షేమ బోర్డులోని 3050 కోట్లను ప్రభుత్వం దారి మళ్లించి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. జిల్లాల్లో ప్రధానమైన నగరాలకు అందుబాటులో ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా మెమో నెంబర్ 1214 రద్దు చేయాలని మంత్రులకు ఎమ్మెల్యేలకు, ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో పి.మునిరాజా, దాసు, శ్రీరాములు, వేణుగోపాల్, తిరుమల రెడ్డి, నరసింహారెడ్డి, రాజా, ఎర్రస్వామి, గిరి, నాగరాజు, పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో

కీళ్ల మార్పిడి పేషెంట్స్‌కి క్రీడా సమ్మేళనం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో గత సంవత్సరం మోకాలి మార్పిడి (టీకేఆర్) ఆపరేషన్ చేసుకున్న వారి కోసం ప్రత్యేక క్రీడాప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ను సంప్రదించే 30 శాతం మంది మోకాళ్ళ నొప్పితో బాధపడుతున్నారు. అయితే, ఎక్కువ మంది 60 సంవత్సరాల పైబడి ఉన్నప్పటికీ, యువత కూడా అధికంగా ఉండడం గమనార్హం. క్రీడోత్సవాన్ని ఉద్దేశించి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ మోకాళ్ళ నొప్పి ఉన్న ప్రతి వ్యక్తికి సర్జరీ అవసరమయ్యే అవసరం లేదు అన్నారు. నొప్పి కారణంగా నిద్ర లేవడం, ప్రతిరోజూ నొప్పి మాత్రలు తీసుకోవాల్సి వచ్చే వ్యక్తులకు మాత్రమే ఆపరేషన్ అవసరం, మిగతా వారు డాక్టర్ సలహాలను పాటించి, వ్యాయామం ద్వారా నొప్పిని తట్టుకోవచ్చు. ఈ క్రీడా ప్రదర్శన మోకాలి మార్పిడి (టీకేఆర్) ఆపరేషన్ గురించి ప్రజల మధ్య ఉన్న అపోహలను, సందేహాలను తొలగిస్తుందని తెలిపారు. ఆపరేషన్ తర్వాత నిత్య వ్యాయామం చేయడం ఎముకల నష్టం నివారించడానికి జాగ్రత్తలు తీసుకోవడం గురించి అవగాహన ఇచ్చారు. రెగ్యులర్‌గా వ్యాయామం చేసిన వారు ఆపరేషన్ తర్వాత పరికర జీవితకాలం కూడా పెరుగుతుందని వివరించారు. ఆపరేషన్ ముందు వారి జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు, ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్లో మోకాలి మార్పిడి (టీకేఆర్) ఆపరేషన్ తర్వాత జీవితంలో జరిగిన ముఖ్యమైన మార్పుల గురించి రోగులు తెలిపారు. ఇందులో భాగంగా పాల్గొన్న వారందరికీ ఉచిత వైద్యపరీక్షలు డాక్టర్ కన్సల్టేషన్ ఆస్టర్ నారాయణాద్రి వారు అందించారు. ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ తమ హాస్పిటల్ అత్యుత్తమ వైద్యనాణ్యతను అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, అన్ని వైద్య విధానాలు, చికిత్సలలో అధిక ప్రమాణాలు పాటించడమే కాకుండా, ప్రతిరోగి ప్రత్యేక అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.



ఉర్దూ వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య లోకనాథం

ప్రజాశక్తి - క్యాంపస్



డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటి రిజిస్ట్రార్‌గా తిరుపతి వాసి ఆచార్య లోకనాథంను రాష్ట్ర ప్రభుత్వం, ఇన్–ఛార్జ్ వైస్ ఛాన్సలర్ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్, చైనా దేశం శాస్త్రవేత్త డాక్టర్ కొరివి మల్లికార్జున్ తిరుపతిలోని ఆయన నివాసం వద్ద అభినందించారు. గండికోట నాగవెంకటేష్ మాట్లాడుతూ ప్రొఫెసర్ లోకనాథం అమెరికా దేశంలో శాస్త్రవేత్తగాను పనిచేశారని, తిరిగి మళ్లీ ద్రవిడ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, రాయలసీమ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా, డిన్ సి.డి.సి, హెడ్, బి.ఓ.స్. చైర్మన్ గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ లోకనాథంను ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమించడం హర్షణీయం అన్నారు.

ఎస్వీయూలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో

సెల్ సపోర్టింగ్ కోర్సుకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 2024 సంవత్సరానికి గాను యస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో బిటెక్ (సిఎస్‌ఈ) సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సు చేరడానికి ఎపి ఈఎపి సెట్ – 2024లో ర్యాంక్ పొందిన అభ్యర్థులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం. భూపతినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆఖరి తేదీని పొడిగించడం జరిగిందని, ర్యాంక్ పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. అలాగే 12వ తేదీన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్లో కౌన్సిలింగ్, అడ్మిషన్స్ చేయడం జరుగుతుందని, ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఫీజుతో రావాల్సిందిగా సంబంధిత విద్యార్థులను కోరారు.

'ఘనంగా స్నేహితుల దినోత్సవం'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: 1983–84 పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో తిరుపతిలో శ్రీపండిట్ జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం తిరుపతి నగరంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. హైస్కూలు విద్యను పూర్తి చేసుకున్న 40 ఏళ్ల తర్వాత కూడా తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, ఎక్కడెక్కడ నుంచో స్నేహితుల దినోత్సవం జయప్రదంకై మిత్రులందరూ తిరుపతి నగరంకు చేరుకుని కోలాహలంగా గడిపారు. కపిలతీర్థం సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 1983 – 84 పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కందారపు మురళి, ప్రధాన కార్యదర్శి కేఎల్ వర్మలు ప్రసంగిస్తూ 40 ఏళ్ల తర్వాత కూడా తాము ప్రతి ఏడాది కలుసుకుంటున్నామని, మిత్రుల మధ్య ఏర్పడిన ఈ బంధం అనేక రకాలైన వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి తోడ్పడే సాధనంగా తమ సంఘం తయారైందని అన్నారు. తమ బ్యాచ్‌లో పలువురు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు, వైద్యులు, ఇంజనీర్లు, వ్యాపారులు, సామాజిక కార్యకర్తలు వంటి అనేకమంది సమాజంలో వివిధ రూపాలలో ప్రభావాన్ని కలిగిస్తున్నారని గుర్తు చేశారు. పగడాల అర్జున్, ట్రెక్కింగ్ బాలు, ఆర్ఆర్ శ్రీనివాస్, శ్రీనివాసులు, కే. సురేంద్ర, ముని, డాక్టర్ రామ్ కుమార్, డాక్టర్ కిషోర్, డాక్టర్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ రమేష్, షఫీ, ఆలీ ఖాన్, బి.సుబ్రహ్మణ్యం, మన్నేపల్లి బాలకృష్ణ, కందారపు సురేంద్ర, మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, విజేవి సురేష్, కెబి శ్రీనివాస్, బివి రాయ్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో ఇలగనూరు సుబ్బరత్నమ్మ వర్ధంతి సందర్భంగా వారి భర్త చెంచయ్య కుమారుడు రమణయ్య సహకారంతో 50మంది నిరుపేద మహిళలకు చీరలు, వెజిటేబుల్ బిర్యాని పంపిణీ చేశారు. సంఘసేవలో విశేష సేవలకు గుర్తింపుగా హోప్ తీయలాజికల్ యూనివర్సిటీ వారు ప్రగతి కుటుంబ సభ్యుడు ఇనుగుంట రమేష్‌కి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతి సేవ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మెడనూరు సురేష్ రెడ్డి, వాచ్ షాపు రాము, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, శివకుమార్ రెడ్డి, పెంచలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి ఘన సన్మానం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఏపీ బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎంపీ మాట్లాడుతూ గూడూరు బ్రాహ్మణ సేవ సంఘాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి శ్రీనివాస రావు, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రామూర్తి, శ్రీనివాస్ కుమార్, నరసింహ రావు, కమల కుమారి, గాయత్రి, పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం: తనుజ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు క్రమం తప్పకుండా తల్లిపాలు అందిస్తే ఆ బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తనుజ తెలిపారు. పట్టణం లోని సరస్వతి శిశు మందిరంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను బాలింతలకు వివరించారు.

బీసీ ఉద్యోగులపై దాడులను అరికట్టండి

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రంలో బీసీ ఉద్యోగులపై దాడులు, వేధింపులు అరికట్టాలని బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. బీసీలకు రక్షణ కల్పించాలని కోరారు.

మృతులకు నివాళి

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం గంగుడుపల్లి గ్రామనికి చెందిన టిడిపి నాయకుడు పందికుంట నారాయణరెడ్డి తల్లి పందికుంట రామసుబ్బమ్మ, మండపంపల్లి గ్రామంలోని టిడిపి నాయకుడు బోడి రెడ్డి దొరస్వామి రెడ్డి చిత్రపటాలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆదివారం జరిగిన కర్మ క్రియలకు ఆయన హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రాగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

సేవతోనే మానవత పెంపు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మనం చేసే సమాజ సేవా ప్రతి ఒక్కరిలో మానవతా విలువలను పెంపొందిస్తాయని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. యువతరం సేవా సమితి 10వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దాతలు రక్తదానం చేశారు. రక్తదానం చేసి మరో ప్రాణం కాపాడుటకు సహకరించారు. యువతరం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

'పరిశుభ్రత పాటించాలి'


ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో "పచ్చదనం- పరిశుభ్రత" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ పరిశుభ్రత మన జీవితంలో భాగం కావాలన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకుంటే క్రమంగా సమాజం, దేశ పరిశుభ్రతకు కూడా పాటుపడిన వారం అవుతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భద్రమణి, హేమలత, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ సాయి కుమారి, డాక్టర్ సునీత, డాక్టర్ శిరీష, డాక్టర్ వసుధ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: కేంద్ర మంత్రి భూపతి రా జు శ్రీనివాస వర్మ పుట్టినరోజు సందర్భంగా తిరుపతిలో రాజు క్షేత్రాణీ ఐక్యవేదిక అధ్యక్షురాలు రుద్రరాజు శ్రీదేవి రాజు కన్వీనర్ గుంటమడుగు వసంత రాజు ఎస్‌టిఆర్ఎఫ్ రీజనల్ కోఆర్డినేటర్ గుండ్రాజు సుకుమార్ రాజుల సంయుక్త ఆధ్వ ర్యంలో ఆదివారం ఓ ప్రైవేట్ హెూటల్లో కేక్ కట్ చేసి శాలువా కప్పి సన్మానించారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తిరుమల పర్యటనలో భాగంగా తిరుపతిలో రాజుల ఆధ్వర్యంలో ఈ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే శ్రీనివాసులు, బిజెపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, భాస్కర్, ఆనంద్, పలువురు శంకర్ రాజు, వెంకటేష్ రాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో తిరుపతి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే శ్రీనివాసులు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

అనుమానితులపై పటిష్ట నిఘా

- గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి పిలుపు
- పట్టణంలో కార్డెన్ సెర్చ్, 11బైక్‌ల స్వాధీనం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పలు అనుమానిత ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి కోరారు. గూడూరు పట్టణంలోని అరుంధతి వాడలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 11ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి అమ్మకాలుపై ప్రత్యేక నిఘా ఉంచామని, రెండు కేసులు కన్నా ఎక్కువ నమోదైతే వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని వెల్లడించారు. అనుమానిత ప్రాంతాలపై ప్రత్యేకంగా ఉంచామని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని అన్నారు. కార్డన్ సెర్చ్‌లో పట్టణ సిఐ పాపారావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


స్నాక్స్ స్కాంపై సమగ్ర విచారణ జరపాలి: కిరణ్ రాయల్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరపాలక సంస్థలో గత వైసిపి ప్రభుత్వ హాయంలో ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేశారనడానికి ఇటీవల వెలుగు చూసిన స్నాక్స్ బిల్లే నిదర్శనమని, వెంటనే అధికారులు స్నాక్స్ స్కాంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వివరించాలని తిరుపతి జనసేన అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కేవలం నగరపాలక సంస్థ అధికారులతో కార్పొరేటర్లు నిర్వహించే భేటీలకు హాజరైన వారికి ఇచ్చే స్నాక్స్, టి, బిస్కెట్‌ల ఖర్చు రూ.3కోట్ల అయ్యిందంటే ఎంత అవినీతి జరిగి ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో సుమన్, కిషోర్, వినోద్, మనోజ్, పవన్, సుమంత్, రాజేంద్ర, సిద్ధు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పార్థసారధికి ఘన సన్మానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):



రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని అలిపిరి వద్ద టిడిపి నాయకులు ఆర్ఆర్ యాదవ్, అన్నా రామకృష్ణ యాదవ్‌లు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. మంత్రి కాన్వాయ్ ముందు ఆర్ఆర్ యాదవ్ ఆధ్వర్యంలో దాదాపు 200మంది యువకులతో బైక్ ర్యాలీగా బయలుదేరి కపిలతీర్థం, లీలామహల్ సెంటర్ మీదుగా యాదవ భవన్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యంగా ప్రతి పేదవారికి సొంత ఇంటి కలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హెచ్ఆర్ఏ సమస్యను పరిష్కరించండి..

ఎమ్మెల్యేను కలిసిన మజ్దూర్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: సిఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా హెచ్ఆర్ఏ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆల్వార్ రోడ్డును ఆర్డీవో రోడ్డుకి అనుసంధానం చేస్తే సిఆర్ఎస్‌కు, శెట్టిపల్లి, మిగిలిన కాలనీలకు కూడా సౌకరర్యంగా ఉంటుందని విన్నవించారు. వారు మాట్లాడుతూ 2011లో తిరుపతి సెన్సెస్ తీశారని, 2021లో కరోనా కారణంగా సెన్సెస్ తీయలేదని తెలిపారు. 2021లో తిరుపతి కార్పొరేషన్‌లో ఎంఆర్‌పల్లి, జీవకోన, అక్కారంపల్లి, టిఎన్‌పాలెం, శెట్టిపల్లిని విలీనం చేశారని కనుక కార్పొరేషన్ కమిషనర్, కలెక్టర్ స్పందించి సెన్సెస్ తీయిస్తే ఐదు లక్షల జనాభా దాటుతుందన్నారు. సెంట్రల్ గవర్నమెంట్‌లో సుమారు 15 వేల మంది ఉద్యోగం చేస్తున్న ఎంప్లాయిస్‌కు 10 నుండి 20శాతం హెచ్ఆర్ఏ పెంపుదల జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం వారికి 20 శాతం హెచ్ఆర్ఏ ఇస్తున్నారని తెలిపారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్, కమిషనర్‌తో చర్చించి పరిష్కరిస్తానని, అలాగే హెచ్ఆర్ఏ 20శాతం పెంపుదల చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కాళహస్తి బాబు, ఛైర్మన్ కె.సదాశివరెడ్డి, ట్రెజరర్ పి.ముని కుమార్, ఆఫీస్ బ్యారర్లు ఎన్.హెన్రీపాల్, కె.మునిరాధయ్య, కె.చంద్రనాయక్, పి.చంద్రశేఖర్ గాండీవన్, తిలక్ కుమార్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ టి.గురవయ్య, మణిమార్, ధనంజయలు, శ్యాంసుందర్, వెంకట్, మునీంద్రబాబు, మునిరామయ్య, నాయుడు, మౌళి కళ్యాణ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తెలుగు భాషా పోటీలు

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం స్థాయి గార్డెన్ సిటీలో నెలకొన్న కళా మందిరంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి తెలుగు భాషా పోటీలను తెలుగు సాహిత్య సాంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వివిధ భాషా పోటీలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరు, ఏడు తరగతులు చదివే విద్యార్థులకు 'తెలుగు భాష గొప్పదనం' అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసం ఉండాలని ఐదో తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులు 'నేటి తెలుగు భాష దుస్థితి' అనే అంశంపై మూడు పేజీలకు మించకుండా ప్రభుత్వ తపాల ద్వారా కళామందిరం చిరునామాకు ఈనెల 15వ తేదీ లోపు పంపాలన్నారు. ఒకటో తరగతి నుండి 5వ తరగతి లోపు పిల్లలు నూరు నీతి పద్యాలు చెప్పగలిగే విద్యార్థులు 9553429770 ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ఒక్కొక్క విభాగానికి 20 మంది చొప్పున 60 మంది గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తామని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి



- ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-రామచంద్రాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం పాకాల మండలంలోని వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గత ప్రభుత్వంలో మొదలుపెట్టి పూర్తిగాని పనుల వివరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ అభివృద్ధి పనులను అధికారులు శరవేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. మండలంలో ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన పలు వాగ్దానాలు వాటి పరిష్కార దిశగా అధికారులు అడుగులు వేయాలని అంతేకాకుండా ఎన్నికలకు ముందు మాత్రమే రాజకీయం.. ఆ తరువాత నియోజకవర్గ అభివృద్ధి నాకు ముఖ్యం అని ఎమ్మెల్యే నాని స్పష్టం చేశారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి: నాని

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: అధికారులు అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ఎర్రావారిపాళ్యం మండలంలోని వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో అన్ని శాఖల అధికారులు వారి అజెండాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. అభివృద్ధికి తోడ్పడాలని స్పష్టం చేశారు. తలకోన ఆలయాన్ని టీటీడీకి అప్పగించి తిరుమల తరహాలో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. తలకోన మాస్టర్ ప్లాన్ ప్రకారం కోనేరు నిర్మాణం, త్రాగునీరు, వైద్యం, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో గంజాయి, నాటు సారా, ఎర్రచందనం వంటి వాటిపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అడవిలో ఎదురు కట్టెలు తెస్తున్న టమోటా రైతులుపై అటవీ అధికారులు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టవద్దని హెచ్చరించారు. ఎర్రచందనంపై దృష్టి పెట్టాలని కోరారు. మండలంలో అవసరమైన చోటికి ఆర్టిసి బస్సులు వేపిస్తామని, తలకోన నీటిని చెరువులకు అనుసంధానం చేసి కాలువలను నిర్మించి అభివృద్ధి చేస్తామన్నారు.

తహశీల్దార్లు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల నూతన తహశీల్దార్‌లు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. రామచంద్రాపురం తహశీల్దార్‌గా వెంకటరమణ, చంద్రగిరి తహశీల్దార్‌గా శివరామ్ సుబ్బయ్య, పాకాల నిత్యానందం బాబు ఇటీవల బదిలీపై వచ్చారు. కాగా ఆదివారం వారు బాధ్యతలు స్వీకరించారు. ఆయా కార్యాలయాల్లో సిబ్బంది తహశీల్దార్‌లకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ పునీతారాణి, సర్వేయర్ హేమ కుమార్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్వోలు వెంకన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పుత్తూరు డివిజన్ ఉపవిద్యా శాఖ అధికారి ప్రభాకర్ రాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి విద్యార్థి దశ నుంచి వాళ్ళ స్కౌట్స్ అండ్ గైడ్స్ డెవలప్మెంట్‌కి ఉపయోగపడాలని ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను తప్పనిసరిగా రన్ చేయాలని ఆయన ప్రత్యేకంగా తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారు మాధవరాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలం నూతన తహశీల్దారుగా ఎస్ మాధవ రాజు ఆదివా రం ఉద్యోగ బాధ్య తలు స్వీకరిం చారు. ఆయన నగరి నియోజకవర్గ విజయ పురం మండలం నుండి డిప్యూటేషన్‌పై ఆదివారం బైరెడ్డిపల్లికి వచ్చారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో సిబ్బంది సమక్షంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి పూల మాలలుతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపాం ు. అనంతరం మర్యాద పూర్వకం గా మండల టిడిపి అధ్యక్షుడు కిషోర్ గౌడును కలిశారు. కిషోర్ గౌడు నూతన తహశీల్దారు మాధవ రాజును పూలమాల వేసి సత్కరించారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి ఉత్సవాలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలోని చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. ఈ జయంతి ఉత్సవాలకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు సిఆర్ రాజన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో వారు పాల్గొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనం స్వాగతం పలికి సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సకాలంలో వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో అన్ని రంగాలలో రాణించాలని అమ్మవారిని కోరుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు పట్టణ నాయకులు ఆర్వీ బాలాజీ, ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, లోకేష్, వెంకట్రమణ, సుదర్శన్, విజయ్, మురళీ, మోహన్ పాల్గొన్నారు.

శ్రీదేవికి డాక్టరేట్



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవి ద్యాలయం తెలుగు అధ్యయన శాఖ పరిశోధక విద్యార్థి భూమా శ్రీదేవికి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సహాయాచార్యులు డాక్టర్ డి.యువశ్రీ మార్గదర్శకత్వంలో "కర్నూలు జిల్లా స్త్రీల పాటలు – ఒక పరిశీలన" అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ అందజేసినట్టు వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య జీవన జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కుప్పం పిఈఎస్ వైద్యబృందం చే 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఆరుగురు ఆపరేషన్ లకు ఎంపిక అయినట్లు మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ పిఆర్ఓ శ్రీనివాసులు తెలిపారు.




టీడీపీ పతాకావిష్కరణ



ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: నారాయణవనం మండలం కేంద్రంలో టీడీపీ పతాక ఆవిష్కరణ అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. మాజీ ఎంపీపీ భక్తవత్సలం ఏర్పాట్లును పర్యవేక్షించారు. ముందుగా కీలగరం మెట్ట వద్ద అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అక్కడి నుంచి ర్యాలీగా ఆటోస్టాండ్ వద్దకు చేరుకుని పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరన్, ఏకాంబరం, గోవిందస్వామి, రవి, ఊరప్ప, మోహన్ మొదిలి, హరి, నరేష్, వేల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి ర్యాలీ ప్రదర్శనను జయప్రదం చేయండి

- భవన నిర్మాణ వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య



ప్రజాశక్తి - గూడూరు టౌన్: పట్టణంలో భవన నిర్మాణ కార్మికులు సమస్యల పరిష్కారానికై సోమవారం తమ సంఘం కార్యాలయం వద్ద నుంచి ఉదయం పది గంటలకు భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తామని అని చెప్పి అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇసుకను అందుబాటులోకి ఉంచక పోవడాన్ని నిరసిస్తూ అలాగే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. జీవో నెంబర్ 12, 14 రద్దుచేసి, పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లు పునరుద్ధరించాలని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: యువతరం సేవ సమితి పదవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బ్లడ్ డ్రైవ్ క్యాంప్లో పాలొగొన్ని రక్తాధానం చేసిన స్వేచ్ఛ ఫౌండేషన్ ఫౌండర్ వంశీ పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్త దానం చేయడం ద్వారా మరొక ప్రాణాన్ని కాపాడిన వాళ్ళం అవుతామని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన యువతరం సేవ సమితికి ధన్యవాదాలు తెలిపారు.


కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: స్విమ్స్, తిరుపతి రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా పాపానాయుడుపేటలోని ప్రాథమిక పాఠశాలలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి ఏర్పేడు మండలం పాపానా యుడుపేట గ్రామ పరిసర ప్రాంత ప్రజలు ఉచితంగా 150మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ ప్రభంజన్, డాక్టర్ సంధ్యారాణి, రోటరీ క్లబ్ తిరుపతి అధ్యక్షులు సోము, రవి కార్యదర్శి రాజేష్, కె.వి చలపతి, జోన్ గవర్నర్ హేమచంధర్, దామోదరం, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కేరళలోని వయనాడ్ జిల్లాలో తీవ్ర వర్షంతో కొండ చరియలు విరిగిపడి 600మంది పైగా గల్లంతయ్యారని ఈ విపత్తులు సర్వం కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవడానికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పేడులో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తలారి బాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కలపాటి గురవమ్మ పాల్గొన్నారు.

కబ్జాదారుల నుండి భూములను రక్షించాలి



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: అగ్ర వర్ణానికి చెందిన కబ్జా దారుల నుండి తమ భూములను రక్షించి న్యాయం చేయాలని బైరెడ్డిపల్లి మండలం తాతిరెడ్డిపల్లికి చెందిన వెంకటలక్ష్మి అభ్యర్థించింది. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడు తూ తాను దళిత మహిళనని, తరతరాల నుండి సర్వే నెం.174/2 లో ఎ.1.24 సెంట్లు సాగు చేసుకుంటున్నానని తెలిపారు. ఈ భూమిపై పెత్తందారుల కన్ను పడిందని, ఎలాగైనా రోడ్ సైడ్ భూమిని కబ్జా చేయాలని రెవెన్యూ వారితో లాలూచీపడి తమ ఊరికి చెందిన అశోక్ కుమార్ పట్టా చేసుకున్నాడని వాపోయింది. ఈ విషయం తమకు తెలిసే లోపే అశోక్ కుమార్ హైకోర్టు దాకా వెళ్లిపోయాడని, కోర్టు ఇన్‌జంక్షన్ ఆర్డరు ఇచ్చిన విషయం తనకు తెలియదని తెలిపింది. ఈ నెల 2వ తేదీ ఉలవలు చల్లుదామని వెళితే అశోక్ కుమార్ దున్నడానికి వచ్చాడని, తాను అడ్డుకున్నానని అశోక్‌కుమార్ 'ఈ భూమి నాది.. అడ్డువస్తే ట్రాక్టర్‌తో తొక్కించి చంపేస్తాను..' అని బెదించాడని వాపోయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, కులం పేరుతో తిట్టానని వీడియో చూపితే కేసు పెడతానని చెప్పి వెనక్కి పంపారని వాపోయింది. ఓ పేపరుపై తన వద్ద సంతకం పెట్టుకున్నారని ఆ తర్వాత అశోక్ కుమార్ పై ఎలాంటి చర్య తీసుకోవద్దని తాను రాసి ఇచ్చినట్లు పేరుపై వుందని తెలిసిందన్నారు. ప్రస్తుతం తమకు వున్న భూమే జీవనాధారమని పోలీసులు న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేసింది. తహశీల్దారు స్పందించి తమకు న్యాయం చేయాలని లేదంటే ఈ నెల 5వ తేదీ తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడుతానని హెచ్చరించింది.

టీటీడీ బీసీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: టిటిడిలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు టిటిడి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం వరదరాజు నగర్‌లోని శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సమావేశంలో టిటిడి బీసీ ఎంప్లాయిస్ నుండి టీటీడీ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ల ఎలక్షన్స్ 2024 సంబంధించి బిసి ఉద్యోగుల నుంచి నలుగురు అభ్యర్థుల్ని గంగా రాజ్ కుమార్, రెడ్డిపల్లి కిషోర్, కె.లోకనాథం, ఎస్.యువరాజ్‌ను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొని తీర్మానించడం జరిగింది. అనంతరం రుయా హాస్పిటల్ దగ్గర టిటిడి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తరపున అన్నదానం నిర్వహించారు. అధ్యక్షులు పావులూరు రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగంగా రాజ్ కుమార్, యాదవ్, కోశాధికారి కామరాజు, మునిబాల కుమార్, గౌరవాధ్యక్షులు మునికుమార్, గౌరవాధ్యక్షులు శైలేంద్రకుమార్, గువ్వల దేసయ్య, కిషోర్, అనురాధ, యువరాజు పాల్గొన్నారు.

రాజు క్షత్రియ రాణుల ఐక్య వేదిక

- అధ్యక్షురాలుగా రుద్రరాజు, శ్రీదేవి కన్వీనర్‌గా గుంటమడుగు వసంత

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఏడుగురు మహిళ సభ్యులతో "రాజు క్షత్రియ రాణుల ఐక్యవేదిక"ను రాయలసీమ రాజుల రాజకీయ చైతన్య వేదిక వ్యవస్థాపకులు గుండ్రాజు సుకుమార్ రాజు ఏర్పాటు చేశారు. వివిధ పార్టీలకు చెందిన మహిళలతో ఏర్పాటైన ఈ ఐక్యవేదిక ద్వారా క్షత్రియుల అభివృద్ధికికార్యాచరణను రూపొందించనున్నారు. అధ్యక్షురాలుగా తిరుపతికి చెందిన వైకాపా మహిళా నేత రుద్రరాజు శ్రీదేవి, కన్వీనర్‌గా వడమాలపేట మండలం ఏఎం పురంకు చెందిన టిడిపి మహిళ నేత గుంట మడుగు వసంత, కో– కన్వీనర్‌గా మంగళం తిరుమల నగర్‌కు చెందిన రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి, సభ్యులుగా మహారాజపురంకు చెందిన విశ్వహిందూ పరిషత్ మహిళా నాయకురాలు దాసరిరాజు మురలమ్మ, బాలయ్య పల్లి మండలం ఎన్‌సీ కండ్రిగకు చెందిన బిజెపి నాయకురాలు దొమ్మరాజు ప్రశాంతి, రైల్వే కోడూరుకు చెందిన కాంగ్రెస్ నాయకురాలు హస్తి లక్ష్మీదేవి, వెంకటగిరికి చెందినదాసరాజు సుజాతలను ఏకగ్రీవంగా నియమించినట్లు ఆయన వివరించారు.

రెండు బైక్‌లు ఢీ

- ముగ్గురుకి గాయాలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రెండు స్కూటర్లు ఢీ కొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు చందనమూడి గ్రామానికి చెందిన కృష్ణ, తేజోవతి ఇద్దరూ నాయు డుపేట చర్చికి వెళ్లి తిరిగి వారి సొంత గ్రామానికి స్కూటర్‌పై వెళుతున్న సమయంలో రాంగ్ రూట్‌లో వారికి ఎదురు వేగంగా వచ్చిన అక్కరపాక గ్రామానికి చెందిన శశిధర్ వారిని వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాద సంఘటనలో అక్కరపాక గ్రామ యువకునికి ముక్కుకు తీవ్రగాయమైంది. కృష్ణకు చేతి మణికట్టు విరిగింది. తేజవతికు తలకు, ముఖంపై గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అక్కరపాక యువకుడిని చికిత్స నిమిత్తం వారి బంధువులు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చేతి మణికట్టు విరిగిన కృష్ణ వైద్యం నిమిత్తం నాయుడుపేట ట్రినిటీ హాస్పటల్‌కు వెళ్లాడు. ఈ సంఘటనపై దొరవారి సత్రం పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గూడూరు టౌన్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గూడూరు రైల్వే స్టేషన్ పరిధిలోని సౌత్ యార్డ్ వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీస్‌ల కథనం మేరకు మృతుడు గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగుర్‌గా గుర్తించామన్నారు. కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నాడని విచారణలో తేలిందన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అనంతరం పోస్టుమార్టరం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.